కార్యాలయంలో ధ్వంసమైన ఫర్నీచర్

బిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడి

- పరిస్థితి ఉద్రిక్తం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డిపై యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. పథకాలు అమలు చేయకుండా, కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని, పరిపాలన చేతకాని సీఎం "రండ.." అంటూ శనివారం జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ కార్యాలయం ఎదుట బైటాయించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న బిఆర్ఎస్ నాయకులకు వీరికి మాటామాటా పెరిగింది. అనంతరం కార్యాలయంలోని ఫర్నీచర్‌ను కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటికే వారిని విడుదల చేయడంపై మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి పేగులు మెడలో వేసుకుంటా అని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతారు కానీ, ప్రజల పక్షాన హామీలు అమలు చేయాలని అడిగితే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. భువనగిరి నియోజకవర్గంలో భూకబ్జాదారులు, రౌడీలు, గూండాలు రాజ్యమేలుతున్నారని, ఈ విషయంపై డిసిపి స్థాయిలో రివ్యూ నిర్వహించి శాంతిభద్రతలను కాపాడాలని పోలీసులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును ముట్టడించేందుకు బిఆర్ఎస్ శ్రేణులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రిన్స్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. ప్రభుత్వం డౌన్‌డౌన్, రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ, కాంగ్రెస్ గూండాలు, రౌడీలు ఖబడ్దార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ కన్వీనర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగాం పాండు, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జక్క రాఘవేందర్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, అజీముద్దీన్, ఏకుబాల్ చౌదరి, మధు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన మాజీ మంత్రులు

బిఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఖండించారు.

పూల రవీందర్‌కు అధ్యాపక సంఘాల మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు రెండు అధ్యాపక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ల అసోసియేషన్ (టిజిసిటిఎ), ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ల అసోసియేషన్ (జిజెఎల్ఎ) తెలంగాణ మద్దతు ఇచ్చాయి. శనివారం హైదరాబాద్‌లో పూల రవీందర్‌ను టిజిసిటిఎ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రిజేష్, జీజేఎల్ఏ తెలంగాణ అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా కలిసి మద్దతు లేఖలను అందజేశారు.

లిక్కర్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గం

- పారదర్శకంగా మద్యం సరఫరా సంస్థల ఎంపిక
- కమిటీ నివేదిక తర్వాతే ధరల పెంపుపై నిర్ణయం
- అబ్కారీ శాఖ సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లిక్కర్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సిఎం సమీక్ష నిర్వహించారు. ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల ధరలను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదనీ, పొరుగున ఉన్న ఎపి, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని సిఎం సూచించారు. హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టిజిబిసిఎల్‌కు సరఫరా చేస్తున్న కంపెనీలు, కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని సూచించారు. కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, కనీసం నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ఆదేశించారు. ఆయా కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలనీ, నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిగా ఎక్సైజ్‌శాఖకు మద్యం సరఫరా చేసే కంపెనీలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం క్రమంగా క్లియర్ చేయాలని సీఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ ముర్తుజా రిజ్వీ, కమీషనర్ హరికిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 'ఉస్మానియా'కు శంకుస్థాపన

జనవరి నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ఆస్పత్రి నిర్మాణంపై సిఎం సమీక్ష నిర్వహించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ పరిధిలో ఉన్న స్థలాన్ని వైద్య, ఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆస్పత్రి భవన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాపులను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. వాటిల్లో కొన్ని మార్పులు, చేర్పులను సిఎం సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో హస్పిటల్ నిర్మాణం ఉండాలనీ, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలని ఆధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం ఉండాలని సిఎం ఆకాంక్షించారు.

సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తాం

- గిరిజన ఆదివాసీ శిక్షణ ముగింపు సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో వారం రోజులు నిర్వహించిన గిరిజన, ఆదివాసీ శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో శనివారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. గిరిజనులకు భూమి తల్లి లాంటిదని, నదులు శక్తి రూపాలు లాంటి వని, ఇవి లేకుంటే జీవం లేనట్టు వారుభావిస్తారని అన్నారు. అడవి, నదులను కాపాడుకుంటూ తమ జీవిస్తున్న ఆదివాసీల హక్కులను కొన్ని ప్రభుత్వాలు దూరం చేశాయన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, ఆర్ఒఆర్, సబ్‌ప్లాన్ లాంటి చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు. గిరిజనులు, ఆదివాసీలు తమ ఆస్తులను కాపాడుకోవడానికి, హక్కులను పొందటానికి20వేల మంది గిరిజన సైనికులను తయారు చేస్తామన్నారు. అందుకే ఈ గిరిజన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో నిర్వహించామని చెప్పారు. రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని తెలిపారు. అందుకు అర్హులైన వారికి ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు, ఎస్‌సి, ఎస్‌టి వారికి రూ.6 లక్షలు మంజూరు చేస్తామన్నారు. జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, 12000 రూపాయల రైతు భరోసా, భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి రూ.12000 అందిస్తామని వివరించారు. జనవరి 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ మొదలు పెడతామని తెలిపారు.

బడ్జెట్లో ఆదివాసీలకు 10 శాతం నిధులు
మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో గిరిజన, ఆదివాసీలకు 10 శాతం కంటే తక్కువ కాకుండా నిధులు కేటాయిస్తామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివాసీ బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం కోసమే ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసీ సమాజాన్ని ఒక తాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

ఆల్ప్రాజోలం డ్రగ్ తయారీ ముఠా గుట్టురట్టు

- సుమారు రూ.60 కోట్ల విలువైన మత్తుమందు పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిషేధిత ఆల్ప్రాజోలం డ్రగ్ తయారీ ముఠా గుట్టు రట్టు చేసి, వారి వద్ద నుంచి దాదాపు రూ.60 కోట్ల విలువ చేసే ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్‌పి చెన్నూరి రూపేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ మేరకు వివరాలను ఎస్‌పి శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. ముత్తంగి గ్రామానికి చెందిన పాత నేరస్తుడు సుధీర్‌గౌడ్ తన కారులో ముత్తంగి నుంచి మెదక్‌కు వెళ్తుండగా ముంబాపూర్ గేట్ వద్ద పోలీసులు అతని కారును ఆపి తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం కూడా అల్ప్రాజోలంను అమ్ముటానికి మెదక్ వెళుతున్నట్టు అతను ఒప్పుకోవడంతోపాటు అతని కారులో రూ.60 కోట్ల విలువ గల ఆల్ప్రాజోలం పట్టుబడిందని ఎస్‌పి తెలిపారు. జీవనోపాధి కోసం బీరంగూడలో నివాసం ఉంటూ, తెలికగా డబ్బు సంపాదించాలనే దురాశతో 2014లో సుధీర్ గౌడ్ అతని భార్య శ్రీవాణి, అతని తమ్ముడు ప్రభుగౌడ్ కమిషన్‌కు కల్లులో కలిపే నిషేదిత అల్ప్రాజోలం మత్తు మందును అమ్మేవారు. ఆ అనుభవంతో 2017లో కానుకుంటకు చెందిన విశాల్ గౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి అల్ప్రాజోలం తీసుకొని అమ్మేవారు. 2020లో గుమ్మడిదలకు చెందిన సాయిగౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి అల్ప్రాజోలం కొని అమ్మేవాళ్లు. కమిషన్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోక, వ్యాపారంలో అధిక లాభాలను చూసి సొంతంగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే సమయంలో విశాల్ గౌడ్.. ముత్తంగికి చెందిన బీశ్వేశ్వర్ సింగ్‌ను పరిచయం చేయగా, అప్పటి నుంచి వీరందరూ కలిసి ఈ నిషేదిత అల్ప్రాజోలం వ్యాపారం చేస్తున్నారు. బీశ్వేశ్వర్ సింగ్‌కు అల్ప్రాజోలంను తయారు చేసే పద్ధతి తెలియడంతో అప్పటి నుంచి దాన్ని తయారు చేసి విక్రయించేవారు. అలా విక్రయించేందుకు మెదక్ వెళుతుండగా సుధీర్‌గౌడ్ సరుకుతో పాటు పట్టుబడ్డాడు. అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్న పటాన్‌చెరు డిఎస్‌పి రవీందర్ రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, జిన్నారం ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పథకాలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేస్తాం

- ఫిబ్రవరి చివరిలోపు

'భూ భారతి' : మంత్రి పొంగులేటి

సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

75వ గణతంత్ర దినోత్సవం రోజున గ్రామసభల్లో చర్చించి రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు పథకాలను ఒకేసారి అమలు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతుభరోసా, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలు, తెల్ల రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను జనవరి 26న ఆచరణలోకి తెస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పీకల్లోతూ అప్పుల్లో కూర్చిందని, అయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలనూ పూర్తి స్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇళ్ల స్థలాలపై మాట్లాడలేనని, జర్నలిస్టులకు మిగిలిన సౌకర్యాలను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. జనవరి 26 నుంచి అర్హులకు తెల్లరేషన్‌కార్డులు ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేల చొప్పున రైతుబంధు ఇస్తే తమ ప్రభుత్వం రూ.6 వేల చొప్పున ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితి మెరుగుపడ్డాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని తెలిపారు. భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12వేలు, రెండు విడతలుగా రూ.6వేల చొప్పున జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు.

26 నుంచే ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా గణతంత్ర దినోత్సవం రోజు నుంచే మొదలు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. దీనిలో భాగంగా మోడల్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టామని, తన నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఆదివారం ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తులు 1.15 కోట్లు రాగా వీటిలో 80.6లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. సాగు భూములున్న వారికి రైతుభరోసా ఇస్తున్నట్టే.. సొంత స్థలం ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున, ఎస్‌సి, ఎస్‌టి నియోజకవర్గాలకు కొన్ని అదనంగా తొలివిడత పంపిణీ కార్యక్రమాన్ని జనవరి 26న ప్రారంభిస్తామన్నారు.

ఫిబ్రవరి చివరిలోపు భూ భారతి...

ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూ భారతిని ఫిబ్రవరి చివరిలోపు అమల్లోకి తెస్తామన్నారు. కోర్టు మెట్లు ఎక్కాల్సిన అవసరం లేకుండా ల్యాండ్ అప్పిల్ అథారిటీని ప్రవేశపెడతామని తెలిపారు. కేసుల సంఖ్యను బట్టి ఓ ప్రాంతాన్ని యూనిట్‌గా తీసుకొని దీన్ని నెలకొల్పుతామని చెప్పారు.

డీజిల్ ఖర్చుల కోసమే ఛార్జీల సవరణ

- టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే స్పెష్టం చేసింది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుందని శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తున్నామనీ, ఈ నేపథ్యంలోనే స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే ఈ సంక్రాంతికి కేవలం ఐదు రోజులు పాటు టికెట్ ధరలను టీజీఎస్‌ఆర్టీసీ సవరించిందని వివరించారు. ప్రయివేటు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దనీ, ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

- బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు, కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ చేసిన దాడిని పిరికి పంద చర్యగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టాలని కాంగ్రెస్ విఫలయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే దాడి జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై జిల్లాపార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే దిగజారుడు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ ప్రశాంతంగా ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందనీ, ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ తెలంగాణలో గూండారాజ్యం చలాయిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ భువనగిరి పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ శ్రేణులతో పాటు, వారి వెనుక ఉన్న నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అందరికీ సమన్యాయం దక్కాలి

- ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిభ కంటే న్యాయం ముఖ్యమైందని, అందరికీ సమన్యాయం దక్కాలని, అన్యాయానికి గురైన వాళ్లు ప్రశ్నిస్తే సమాజం చైతన్యవంతమవుతుందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం ప్రొఫెసర్ సి.కాశీం అధ్యక్షతన "ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ అమలు కోసం మేధావుల సంఘీభావ సభ" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీడిత కులాల తరపున ఈ సభలో మాట్లాడటం తనకు వచ్చిన గొప్ప అవకాశమన్నారు.

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. సమాన అవకాశాలు కల్పించడానికి ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. దానికి చట్టపరంగా, రాజకీయపరంగా ఉన్న ఆటంకాలను తొలగించి వర్గీకరణ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సుదీర్ఘ పోరాటం చేసి విజయం ముంగిట్లో ఉన్న ఉద్యమాన్ని అభినందించారు.

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోని ఐక్య ఉద్యమాలకు పునాదిగా వర్గీకరణ ఉద్యమం పనిచేసిందని, సూక్ష్మ స్థాయి సమస్యలను బయటకు తీసుకొచ్చిందని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఒక జడ్జిగా అన్ని కోణాల నుంచి శాస్త్రీయంగా పరిశీలించి ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ అనేది రాజ్యాంగబద్ధమైందని చెప్పారు. మాల, మాదిగలు వర్గీకరణ సమస్యను పరిష్కరించుకొని భవిష్యత్ ఉద్యమాల నిర్మాణంలో క్రియాశీలకంగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్‌తో 30 ఏండ్లుగా దండోర ఉద్యమం సాగుతోందని, ఈసారి తప్పనిసరిగా వర్గీకరణ జరిగి రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా అందుతాయని అన్నారు. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. ఎస్‌సి రిజర్వేషన్‌ను వర్గీకరించి తీరాలన్నారు. ప్రజలందరికీ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం కల్పించే విధంగా భవిష్యత్ ఉద్యమాల నిర్మాణం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ నందిని సిధారెడ్డి, విమలక్క, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, ప్రొఫెసర్ భాంగ్య భూఖ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ ఆరెపల్లి రాజేందర్, బూరం అభినవ్, గజవెల్లి ఈశ్వర్, వెంకట్ మారోజు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- లేబర్ కోడ్‌లను తక్షణమే విరమించుకోవాలి
- సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు సాయిబాబు

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు అన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వివిధ వృత్తుల్లో పనిచేస్తున్నారని, వారి సంక్షేమాన్ని తుంగలో తొక్కేలా ప్రభుత్వాల విధానాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డులో మార్పులు చేస్తూ నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమ పథకాల దరఖాస్తులకు నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. దహన సంస్కారాలకు ఇచ్చే 30 వేలను లక్ష రూపాయలకు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికీ రూ.6000 పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి ఆర్.కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదం శ్రీనివాస్, కోశాధికారి యల్క సోమయ్య గౌడ్, సిహెచ్.లక్ష్మీనారాయణ, అనంతల మల్లయ్య, సోములు, లక్ష్మయ్య, ఉప్పలయ్య, గాలయ్య, జంగయ్య, సాగర్, రాములు, నాగేశ్వరరావు, రమేష్, బాలాజీ నాయక్, రాజేశ్వరి, సుజాత, మంజుల పాల్గొన్నారు.

ప్రయివేటు ట్రావెల్స్‌పై ఆర్‌టిఎ కొరడా

- ఆరు రోజుల్లో 250 బస్సులపై కేసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సంక్రాంతి పండుగ వేళ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై దాడులు నిర్వహిస్తున్నారు. అడ్డగోలు టికెట్ ధరల వసూళ్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు కొనసాగిస్తున్నారు. ముంబయి, బెంగళూరు, విజయవాడ, నాగ్‌పూర్ హైవేలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆరు రోజులుగా కొనసాగుతున్న దాడుల్లో 250కి పైగా బస్సులపై కేసులు నమోదు చేసినట్టు రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ పరిధిలో 130 బస్సులపై కేసులు నమోదు కాగా, రూ.52వేల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. ఈ తనిఖీలు ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు ట్రావెల్స్ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ప్రయాణికులు మండే స్వభావం గల పదార్థాలను తీసుకెళ్లకుండా చూడాలని, ఇద్దరు డ్రైవర్లు లేని ట్రావెల్స్‌పై కేసులు నమోదు చేయాలని మంత్రి, కమిషనర్ సూచించడంతో ఆర్టీఏ అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపడుతున్నారు. గతంలో జరిగిన బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రెండ్రోజులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ జేటీసీ చంద్రశేఖర్‌గౌడ్ పర్యవేక్షణలో రంగారెడ్డి డీటీసీ సదానందం, ఆర్టీవోలు కిష్టయ్య, పురుషోత్తం రెడ్డి, ఇతర ఆర్టీవోలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు తనిఖీలు చేపట్టి 250పైగా బస్సులపై కేసులు నమోదు చేశారు.

IN THE COURT OF THE HON'BLE V ADDL.DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
I.A.NO: 2992 OF 2024
IN
A.S.S.R.NO. 9424 OF 2024

BETWEEN:
Koduru Srisalam
...Petitioner/Appellant
AND
Vijaya Raj Jain And Others
...Respondents/Respondents

To,
D.Raghava Reddy, S/o Sesha Reddy, Aged about 43 years, Occ: Business R/o Shailaja Apartments, plot No. 123/B Mothinagar, Hyderabad Telangana State-500018
Respondent/Respondent No.8

Take notice that the Petitioner/Appellant herein filed the above petition/Appeal against you in I.A. No. 2992/2024 in AS.SR.No.9424 of 2024 under Order XLI Rule 3(A) of CPC on the file of the Hon'ble Vth Addl. District Judge Ranga Reddy District at L.B.Nagar the said case is stands posted to 17-02-2025 for your appearance and filing of Counter. Hence you are hereby directed to be present before the above Court on 17-02-2025 at 10.30 A.M. either in person or through an advocate, failing which the matter will be decided basing on the documents available on record and on merits.

(BY ORDER OF THE COURT)
(J. SHIVA KUMAR)
Advocate
H.No.11-15-202/2, Street No.5. J.B. Colony, Saroornagar Mandal, Ranga Reddy District-500035
Cell: 9848 447 448.
Counsel for the Petitioner/Appellant

పాలన చేతకాకే దాడులు

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలన చేతకాకే కాంగ్రెస్ దాడులకు తెగబడుతున్నదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని ఆయన శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయిస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, లేదంటే దాడులు చేయించడం ఆ పార్టీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. హోమ్ మంత్రి లేకపోవటంతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి చర్యనూ గుర్తుపెట్టుకుని రానున్న రోజుల్లో వాటికి బదులిస్తామని హెచ్చరించారు.

ఫిబ్రవరిలో ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు వచ్చేనెల తొమ్మిది, పది తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయి. శనివారం హైదరాబాద్‌లో ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జాతీయ సమితి సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అది అమల్లోకి వస్తే దేశానికి, విద్యారంగానికి ప్రమాదకరమని చెప్పారు. ఎన్ఇపి రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తున్నదని విమర్శించారు. ఎన్ఇపి పేరుతో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నదని అన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తున్నదని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, జీడీపీలో ఆరు శాతం నిధులను విద్యారంగానికి కేటాయించకుండా ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పాఠ్యపుస్తకాల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం పదాలతోపాటు డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించిందని అన్నారు. వాటి స్థానంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన హెడ్గేవార్, వీర సావర్కర్ వంటి వారి చరిత్రను పొందుపరుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ చరిత్రను, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్నదని చెప్పారు. ఎన్ఇపి-2020ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చేనెల తొమ్మిది, పది తేదీల్లో జరిగే ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ స్టాలిన్ కోరారు.

తలసేమియా రోగులకు రక్తదాన శిబిరం

- అగర్వాల్ సమాజ్ నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్

తలసేమియాతో బాధపడుతున్న వ్యక్తులకు కీలకమైన సహాయాన్ని అందించడం కోస అగర్వాల్ సమాజ్ తెలంగాణ, హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్, హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్‌లు రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. తొలిరోజు ఘాసీ బజార్ మార్కెట్‌లోని సూరజ్ భవన్‌లో, రెండవ రోజు చార్‌కమాన్‌లోని అగర్వాల్ శిక్షా సమితి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ శిబిరంలో సేకరించిన 314 యూనిట్ల రక్తాన్ని తలసేమియా మరియు సికిల్ సెల్ సొసైటీకి దానం చేయనున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. శిబిరంలో తలసేమియా మరియు సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్‌తో సహా, అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు మనీష్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం అగర్వాల్, కోశాధికారి నవీన్ అగర్వాల్, గౌరవ కార్యదర్శి కపూర్ చంద్, హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ మరియు ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కీలక ప్రతినిధులు పాల్గొన్నారు.

లెక్కలు పక్కా..!

- తేడాలొస్తే పంచాయతీ ఎన్నికల్లో నష్టం
- పడావు భూములు, వెంచర్లు, మైనింగ్, ఇళ్లపై ఆరా
- నాలా కన్వర్టు భూములకు చెక్
- పాత ఫైళ్లు దులుపుతున్న రెవెన్యూ అధికారులు
- అర్హుల జాబితా బాధ్యత ఎఇఒలదే...
- 28 నుంచి రైతు భరోసా విడుదలకు కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై నజర్ పెట్టింది. సాగు భూముల లెక్కలు పక్కగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. ఈ విషయంలో ఏ మాత్రం తేడావొచ్చినా కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నది. మరోవైపు ప్రభుత్వం కూడా బదనాం అవుతుందనే టెన్షన్ ఉన్నది. ప్రస్తుతం పంచాయతీల్లో బిఆర్ఎస్ పార్టీకి 80 శాతానికి పైగా సర్పంచులు ఉండగా, కాంగ్రెస్‌కు 18 శాతం, ఇతర పార్టీలకు రెండు శాతం మంది సర్పంచులు ఉన్నారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హస్తం పై చేయి సాధించేందుకు రైతు భరోసాను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నది. 'కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్టు రాళ్లు, రప్పలకు రైతు భరోసా ఇవ్వకూడదు... అలాగాని అర్హులకు ఎలాంటి నష్టం జరగకూడదు' అనేది సర్కారీ లెక్క. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురాలంటే, సాగు భూముల లెక్కలు, సాగు రహిత భూముల లెక్కలను కచ్చితంగా నిర్ధారించాలని నిర్ణయించింది. అందుకు రెవెన్యూ శాఖ అధికారులను రంగంలోకి దించింది. ముఖ్యంగా తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లకు ఆ బాధ్యతను అప్పగించింది. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద పడావు భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, మైనింగ్ భూములు, లే అవుట్లు, నాలా కన్వర్టు అయిన భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు ...తదితర భూములకు కోట్ల రూపాయలు బిఆర్ఎస్ సర్కారు చెల్లించింది. ఈ క్రమంలో అటువంటి భూములను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు పాత ఫైళ్లను దులుపుతున్నారు. ప్రస్తుతానికి అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో రైతు భరోసా అమలుపై కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ శివారు ప్రాంతాల్లో, మున్సిపాలిటీల్లో కూడా రైతు బంధు పథకాన్ని అమలు చేశారు. ఈసారి వీటన్నింటికి

కాంగ్రెస్ సర్కారు రైతు భరోసా ఇవ్వకూడదని నిర్ణయించింది. అందుకు కచ్చితమైన లెక్కలు తీసి, దాని ఆధారంగా అనర్హులకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతున్నది. ఈ లెక్కల ప్రకారం రైతు భరోసా ఎందుకు వేయలేదో చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఈ సారికి అర్హులైన రైతులకు రైతు భరోసా ఇవ్వడం, ఏ రైతుకు సీలింగ్ పెట్టే ఆలోచన ప్రభుత్వానికి లేదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు ఐదువేలు ఇచ్చింది. ఈసారి ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచి, ఎకరాకు ఆరువేలు చేసింది. ఏడాదికి ఎకరాకు రూ. 12వేలు ఇవ్వబోతున్నది. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12వేల ఇస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే.

రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయం

సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ సర్కారు...అందుకు తేదీ కూడా ఖరారు చేసినట్టు తెలిసింది. ఈ నెల 28 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. అందుకనుగుణంగా రెవెన్యూ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) సమన్వయంతో పని చేస్తున్నారు. ఆ రెండు శాఖల అధికారులతో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో కలెకర్లు సమావేశాలు నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. గతంలో రైతు బంధు తీసుకున్న వారి జాబితా ఏఈవోల దగ్గర ఉన్నది. అందులో అన్హరుల పేర్లు తొలగించేందుకు రెవెన్యూ లెక్కలు తీస్తున్నది. వాటి ఆధారంగా కొత్త జాబితా సిద్ధం చేయనుంది. వారికే ఈ ప్రభుత్వం రైతు భరోసా జమ చేయనుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఏఈవోలు డిజిటల్ క్రాప్ సర్వే కూడా పూర్తి చేశారు. వానకాలంలోనైతే మొత్తం భూమి సాగు చేస్తారు. పత్తి, వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, సోయా, ఆముదం, పప్పు ధాన్యపు పంటలు పండిస్తారు. అయితే యాసంగి సీజన్ కాబట్టి కేవలం ఆరుతడి పంటలు మాత్రమే వేస్తారు. తమకున్న భూమిలో బోర్లు, బావులు, కాలువల కింద వరి, సోయా, మొక్క జొన్న, కూరగాయల పంటలు వేస్తారు. మిగతా భూమి వర్షాధార పంటలు వేస్తారు. కొంత మంది రైతులు తమకు ఉన్న భూమిని మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులను పెంచుకుంటారు. అవే వారికి జీవనాధారం. పామాయిల్, పండ్ల తోటలు, కూరగాయలు, ఆకు కూరలు పండిస్తారు. వీటి పంట కాలంలోనూ వ్యత్యాసం ఉంది. కొన్ని పంటలు 30 రోజుల్లో చేతికొస్తే...మరికొన్ని 8 నెలలకు వస్తాయి. పామాయిల్, పండ్ల తోటలు ఏండ్లపాటు పంటనిస్తాయి. ఈ పంటలు పండే భూములకు కచ్చితంగా పెట్టుబడి సాయం ఇస్తామని చెబుతున్నది.

కేంద్రం వాటా పెరగాలి

- బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు కోడి గుడ్డు ఇవ్వకపోవడం సరికాదు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా పెరగాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా పోషకాహారాన్ని బాలింతలు, పిల్లలకు అందించాల్సి ఉంటుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్డును దూరం చేయడాన్ని ఆమె ఆక్షేపించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ పట్టణంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అధ్యక్షతన జరిగిన చింతన్ శివిర్‌లో మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రంలో పౌష్టికాహారం కోసం అమలవుతున్న ఆరోగ్యలక్ష్మి పథకం, బాలామృతం గురించి ఆమె వివరించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక ప్రకారం సరైన పోషకాహారం అందక దేశంలో 30 శాతానికి పైగా ఐదేండ్ల లోపు చిన్నారులు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారనీ, మహిళలు రక్తహీనతతో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పోషకాలు అధికంగా ఉండే కోడిగుడ్లను బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయడం లేదనీ, సాంస్కృతిక కారణాలు ఏవైనా అడ్డుగా ఉంటే, కోడిగుడ్డు స్థానంలో అధిక పోషకాలు ఉండే ఇతర ప్రత్యామ్నాయ పదార్థాలను అందివ్వాలని సూచించారు. ఆ మేరకు కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. సమావేశంలో రాష్ట్రం తరఫున మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ హాజరయ్యారు.

27న రాష్ట్రానికి ఖర్గే, రాహుల్‌గాంధీ

- ఇష్టాగోష్టిలో మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 17 రాష్ట్రంలో 'సంవిధాన్ బచావో' ప్రదర్శన నిర్వహిస్తామని టిపిసిసి అధ్యక్షులు మహేకుమార్‌గౌడ్ చెప్పారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రదర్శనకు హాజరు అవుతారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రివర్గ విస్తరణ గురించి మాట్లాడలేదని చెప్పారు. దానిపై ముఖ్యమంత్రి, ఎఐసిసి నేతలు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కార్పొరేషన్లు, బోర్డులు, కమిషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాలపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తామని వెల్లడించారు. టీచర్స్ ఎమ్మెల్సీ విషయంలో ఎవరికీ మద్దతు ఇవ్వాలన్న అంశంలో ఎఐసిసి ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, సిఎం, మంత్రుల అభిప్రాయం తీసుకుంటామని వివరించారు. కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు యువకులు మునిగి చనిపోయిన సంఘటన పట్ల మహేష్‌కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత ఇలా అర్ధాంతరంగా జీవితాలను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు తన సానుభూతిని వ్యక్తం చేశారు.

గుల్జార్ కవిత్వాలు జీవితానికి మార్గదర్శకాలు

- ఆయన కవిత్వాన్ని అనువదించడం గొప్ప విషయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుల్జార్ కవిత్వాలు జీవితానికి మార్గదర్శకాలని అటువంటి గొప్ప వ్యక్తి కవిత్వాన్ని అనువదించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ కవి గుల్జార్ కవిత్వాలను తెలుగులోకి కవి వెన్నెల సత్యం అనువదించగా.. అందుకు సంబంధించిన గుల్ మొహర్ పుస్తకావిష్కరణ సభ శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి, విమర్శకులు ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గుల్జార్ కవితల్లో బంధాలు, బంధుత్వాలను లోతుగా విశ్లేషించే వారని, కొన్ని కవితలు సమాజం పట్ల ప్రేమను ఔనత్యాన్ని వివరిస్తాయని అన్నారు. ఆయన రచించిన కవిత మాధుర్యంలో ఎవరైనా మనల్ని రావద్దు అని తలుపులు మూసేస్తే గొళ్లెం రెండోవైపు కూడా ఉందని గుర్తు చేయడం ఆయన మేధస్సుకు నిదర్శనం అన్నారు. సాహిత్యాన్ని ప్రేమించే వారు కవులు, వారి సమయాన్ని సర్వస్వాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. వారు చేసే ప్రతి పనిలో కవిత్వమే కనిపిస్తుందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి గుల్జార్ అన్నారు. ఆయన కవితల్లో ప్రజలు నిత్యం అనుకునే విషయాలు, దినచర్యలో భాగాలను అద్భుతమైన ఊహలతో నిండి ఉంటాయన్నారు. అటువంటి కవితలను అనువదించడం అంటే ఎంతో గొప్ప విషయం అని చెప్పారు. కవి వెన్నెల సత్యం సాహసంతో కూడిన ఈ పనిని

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, విమర్శకులు

ఎంతో నేర్పుగా చేసి మనకు చక్కని కవిత్వాన్ని అందించారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఆనందచారి మాట్లాడుతూ.. గుల్జార్ తన కవిత్వాల్లో ఎటువంటి ఆటంకం లేకుండా రాస్తూనే ఉండేవారన్నారు. జీవితం ఎలా ఉండాలి, ఎంత గొప్పగా బతకాలి అనే విషయాలను తన కవిత్వంలో యువతకు నేర్పించేవారని తెలిపారు. సృజన మనిషిలో ఎప్పుడు ఉంటుందో అప్పుడు చైతన్యం వస్తుందని, ప్రతి మనిషి నిత్య విద్యార్థి వలే ప్రతి విషయాన్నీ అభ్యసించాలని చెప్పారు. కవుల్లో చైతన్యం లేకపోతే సమాజాన్ని జాగృతం చేయలేరన్నారు. కవి గుల్జార్‌కు యావత్ సమాజం రుణపడి ఉంటుందన్నారు. గుల్జార్ కవిత్వాలను తెలుగు సాహిత్యం లోపించకుండా అనువదించిన వెన్నెల సత్యం కవుల్లో అగ్ర భాగాన నిలుస్తారని అన్నారు. ఆయన కఠోర శ్రమ ఏకాగ్రతతో సాధించారని గుర్తు చేశారు. అనువాదకర్త, కవి వెన్నెల సత్యం మాట్లాడుతూ.. సామాజిక మధ్యమాలలో మహాకవి గుల్జార్ కవిత్వాలు తనను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. అవి చదవగానే తెలుగులోకి అనువదించాలన్న ఆకాంక్ష బలంగా కలిగిందని, అలా కొంత సాధన ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టి కవి మిత్రులు ప్రోత్సహించడంతో అడుగు ముందుకు వేశానన్నారు. అనువాదాలలో తొలి అడుగే గనక వారిని మార్గదర్శకులుగా భావిస్తానని చెప్పారు. ఈ పుస్తకానికి గుల్ మొహర్ అనే శీర్షిక పెట్టడం గుల్జార్ కలానికి పూసి పరిమళించిన గుల్ మొహర్ పూలుగా భావించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ కవి ఐఆర్ఎస్ అధికారి జల్ది విద్యాధరరావు, దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక రాపోలు సీతారామరాజు, కవి మిత్రుడు డాక్టర్ వి.జయప్రకాష్, అనంతోజు మోహనకృష్ణ, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికతో నియంత పాలన

- సెప్టెంబర్ 21 నుంచి చండీగఢ్‌లో జాతీయ మహాసభ
- సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్‌పాషా

ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానాన్ని తేవడం ద్వారా దేశంలో నియంత పాలనను తెచ్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసిందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో శనివారం సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ శతాబ్ది వేడుకలు, జాతీయ మహాసభలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఇటీవల కాలంలో మరణించిన వారికి సంతాప సూచకంగా మౌనం పాటించారు. అనంతరం అజీజ్‌పాషా మాట్లాడుతూ... ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచేందుకు బిజెపి కూటమికి ధనబలంతోపాటు, ఇండియా కూటమి అనైక్యత కూడ తోడైందని తెలిపారు. దీంతో బిజెపి విజయం సులభమైందని చెప్పారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల ఉద్యమం ఢిల్లీ వేదికగా నేటికీ కొనసాగుతోందనీ, దీనికి సంఘీభావంగా రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహించాలని సూచించారు. సిపిఐ శతాబ్ది వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. అందుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సమరశీల పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ 25వ జాతీయ మహాసభ చండీఘడ్‌లో సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా మే లో దేశంలోని నలుమూలల నుంచి నాలుగు జాతాలు ప్రారంభమై చండీఘడ్ చేరుకుంటాయని చెప్పారు. ఆగస్టు 31 నాటికి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని మహాసభలనూ పూర్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ తదితరులు హాజరయ్యారు. కొండపోచమ్మ సాగర్‌లో ఈతకు వెళ్లి మరణించిన విద్యార్థులకు సిపిఐ రాష్ట్ర సమితి సంతాపం తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

కొండపోచమ్మ ఘటనపై బిఆర్ఎస్ నేతల దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొండపోచమ్మ సాగర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు గల్లంతు కావడంపై బిఆర్ఎస్ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. యుక్త వయసులో ఉన్న యువకులు అకాల మరణం చెందడం కుటుంబాలకు తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి, సంతాపం తెలిపారు.

సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందడం పట్ల మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువత అకాల మరణం చెందడం మనస్సును కలిచి వేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ వేళ బిడ్డల్ని కోల్పోయి బాధలో ఉన్న కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున ఎక్ గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

13 నుంచి కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

- హాజరు కానున్న 16 దేశాల కైట్ క్రీడాకారులు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో సోమవారం నుంచి ఈ నెల 15 వరకు అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేలా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్న ఈ పతంగుల వేడుక పోస్టర్‌ను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ఓ మినీ ఇండియా అనీ, దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా నగరంలో స్థిరపడ్డారని వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ క్రీడాకారులు, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగరేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచనున్నామని పేర్కొన్నారు.

తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, వారసత్వ కట్టడాలు, ప్రాచీన దేవాలయాలను సందర్శించాలని ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను కోరారు. రాష్ట్ర పర్యాటక శాఖ అందుకు తోడ్పాటునందిస్తుందని తెలిపారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల ఆ ప్రాంత చరిత్ర సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకోవడంతోపాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని ప్రకటించారు. పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరనీ, అదే తెలంగాణ ప్రత్యేకతని కొనియాడారు.

15 లక్షల మంది వస్తారని అంచనా

మూడు రోజుల పాటు జరగనున్న కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు దాదాపు 15లక్షల మందికి పైగా వీక్షకులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వేడుకలను తిలకించటానికి వచ్చే సందర్శకులకు అసౌకర్యం కలుగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కైట్ ఫెస్టివల్‌లో హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సందర్శకుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ క్లైట్ క్రీడాకారులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో మాజీ మంత్రులకు పిలుపు

- కాళేశ్వరం విచారణలో కీలక మలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ త్వరలో కీలకమలుపు తిరగనుంది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించిన మంత్రులను పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈమేరకు కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ రంగం సిద్ధం చేస్తున్నది. కమిషన్‌కు సహకరించే కో-ఆర్డినేషన్ కమిటీ ఈమేరకు సన్నాహాలు చేస్తున్నది. బిఆర్ఎస్ సర్కారు హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఈటల రాజేందర్‌తోపాటు నీటిపారుదల శాఖ మంత్రిగా వ్యవహరించిన తన్నీరు హరీష్‌రావును సైతం పిలవనున్నట్టు తెలిసింది. కాగా ఆర్థిక శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు విచారణ పదే పదే వాయిదా పడుతూ వస్తున్నది. నిరంతరం తీరికలేకుండా ఉండటంతో కమిషన్ ఆయనకు వెసులుబాటును కల్పించినట్టు సమాచారం. నిర్మాణ, డిజైన్లు, హైడ్రాలజీ, డ్యామ్ సేఫ్టీ, ఒఅండ్ఎం, నాణ్యత పర్యవేక్షణ, గణాంక విభాగాలకు చెందిన మాజీలతోపాటు ప్రస్తుత అధికారులను విచారించిన విషయం విదితమే. అలాగే అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు మాజీ ఈఎన్సీల విచారణ పూర్తయింది. ఇప్పుడు ఇక ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులను పిలవాల్సి ఉంది. అందులో భాగంగానే ఈటల, హరీష్‌కు తాఖీదులు పంపనున్నారు. అనంతరం మాజీ సిఎం కెసిఆర్‌కూ నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 20న కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ కోల్‌కతా నుంచి హైదరాబాద్ రానున్నారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల విఫలమైన నేపథ్యంలో న్యాయ విచారణ గత నెలలు సాగుతున్న విషయం విదితమే.

చేనేతకు మొండిచేయి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కార్మికులకు అభయహస్తం పథకాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కోత విధించి మొండి చేయి చూపుతోందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేతకు చేయూత పొదుపు పథకాన్ని 26 నెలలకు తగ్గించటం సబబు కాదని పేర్కొన్నారు. చేనేత కార్మికులను మోసం చేయటమేకాక మరేమిటని ప్రశ్నించారు. గత ఐదేండ్లుగా అమల్లో ఉన్న నేతన్న బీమా పథకాన్ని నేతన్న భద్రత పేరు మార్చి మళ్లీ ప్రకటించి తానేదో నేతన్నలకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్టు సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. యారన్ సబ్సిడీ పథకం ద్వారా నేత కార్మికుడికి రూ.2000, అనుబంధ కార్మికుడికి రూ.500 గత ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన సంవత్సర కాలం నుండి ఆ పథకాన్ని నిలిపివేసిందని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా చేనేత కార్మికుడికి రూ. 18వేలిస్తామంటూ సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. గతంలో ఏడాదికి రూ.24 వేల నుంచి రూ. 18వేలకు తగ్గించి చేనేత కార్మికులను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం ప్రకటించిన చేనేత అభయ హస్త పథకాలు కొత్తవి కావనీ, గతంలో ఉన్న పథకాల పేరు మార్చి కోతలు విధించారని విమర్శించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయకపోగా పాత పథకాలను పేర్లు మార్చి కోతలు విధించటం మానుకోవాలని హెచ్చరించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి అనేకమంది యువకులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో లైశెట్టి రాజు (26) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి దాదాపు రూ.40 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దాంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి అర్ధాంతరంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండె పగిలేలా రోదిస్తున్నారు. స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరగాయలు, పాల వ్యాపారం చేసుకునే తల్లిదండ్రులకు కొడుకు రాజు.. చేదోడువాదోడుగా ఉంటూ రోజూ ఉదయం గ్రామంలో ఇంటింటికి పాల ప్యాకెట్లు వేసి ఉపాధి పొందేవాడు. కాగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డ రాజు.. డబ్బుల కోసం తండ్రిని వేధిస్తుండేవాడు. తండ్రి కన్న కొడుకును కాదనుకోలేక ఊళ్లోనే దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. అయినా కొడుకు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసయ్యి డబ్బుల కోసం కొంతకాలంగా వేధిస్తున్నాడు. రెండు రోజుల ముందు కూడా లక్ష రూపాయలు ఇవ్వగా అవి కూడా పోగొట్టుకున్నాడు. దాంతో మరో రూ.4లక్షలు ఇవ్వాలని, లేదంటే తనకు ఆత్మహత్యే శరణమని చెప్పడంతో తల్లిదండ్రులు దిక్కుతోచక మనోవేదనకు గురయ్యారు. తెలిసినవారందరి దగ్గరా అప్పులు చేయడంతో మళ్లీ అప్పు పుట్టడం లేదని కొడుకుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు కుటుంబసభ్యులు. డబ్బులు ముట్టకపోవడంతో రాజు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజు సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.